# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేదీ. 11.07.2026 సమయం. 18.10గంటలు

## ముఖ్యాంశాలు

1. హైదరాబాద్‌ను ప్రధాన హై-స్పీడ్ రైల్ హబ్‌గా రూపొందించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
2. హైదరాబాద్ లో ఎమిరేట్స్ వైమానిక సంస్థ తన సేవలను విస్తరించేందుకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్హాన్ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.
3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తమ పాలనపై నమ్మకం ఉంటే అసెంబ్లీని రద్దు చేసి తాజాగా ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.
4. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా, మౌళిక వసతులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**అశ్విని వైష్ణవ్**

హైదరాబాద్‌ను ఒక ప్రధాన హై-స్పీడ్ రైల్ హబ్‌గా రూపొందించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. హైదరాబాదును పూణే , చెన్నై, బెంగళూరు నగరాలతో అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్లను

ప్రతిపాదించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఈరోజు జరిగిన ఒక పరిశ్రమల సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఈ హై-స్పీడ్ రైల్ నెట్‌వర్క్ వల్ల ప్రయాణ కాలం గణనీయంగా తగ్గడమే కాకుండా, దక్షిణ భారతదేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాల మధ్య అనుసంధానత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ రంగాల గురించి కూడా మంత్రి ప్రస్తావించారు. దేశం ప్రస్తుతం 'ఏఐ-యాజ్-ఎ-సర్వీస్' మోడల్‌ను అవలంబిస్తోందని, ఎలక్ట్రానిక్స్ తయారీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. చిప్ డిజైనింగ్ రంగానికి అవసరమైన దేశీయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, దేశవ్యాప్తంగా 315 విశ్వవిద్యాలయాలలో సెమికండక్టర్ డిజైన్ టూల్స్‌ను ప్రవేశపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ... బుల్లెట్ రైలు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 5 లక్షల కోట్లను కేటాయించిందని తెలిపారు. అలాగే తెలంగాణలోని సికింద్రాబాద్, నాంపల్లితో సహా 42 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించే లక్ష్యంలో భాగంగా... ఐటీ పరిశ్రమలను వరంగల్, కరీంనగర్ వంటి టైర్-2 నగరాలకు విస్తరించాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**డెస్క్**

మేకిన్ ఇండియా

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సంగారెడ్డి జిల్లా శివారులోని నందిగామ ప్రాంతంలో 375 ఎకరాల్లో విస్తరించి ఉన్న మేధా రైల్వే కోచ్ విడిభాగాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. మేకింగ్ ఇన్ ఇండియాలో భాగంగా ప్రైవేట్ రంగ సంస్థలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలోని విడిభాగాల తయారీని, కార్మికుల నైపుణ్యాలను , తయారీ విధానాన్ని కార్మికుల ను అడిగి తెలుసుకున్నారు. మేధా సంస్థ రూపొందిస్తున్న డ్రైవర్ రహిత వాహనాన్ని కూడా పరిశీలించారు. మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

SANGAREDDY. PTC

ఎమిరేట్స్ వైమానిక సంస్థ

ఎమిరెట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్వాన్ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఎమిరెట్స్ A-380 సర్వీసులను ప్రారంభించేందుకు సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చే శారు. వైమానిక సేవలను పెంచాలని అలాగే తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా Emirates MRO ఆపరేషన్స్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇందుకు గాను

కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చే శారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్షిప్ ఇవ్వడానికి ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరగా.. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

డెస్క్

**మంత్రి పొంగులేటి**

భూ భారతి చట్టం సమర్ధవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పా టైన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని , రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పైలట్ ప్రాతిపాదికగా చేపట్టిన రీ-సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. రీ సర్వే కోసం సుశిక్షితులైన సర్వేయర్లను వినియోగించుకోవాలని సూచించారు.

పీటీసీ ఖమ్మం

**జూపల్లి**

ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మండలంలోని మాణిక్ గూడ , ధనోరా , కోమటిగూడలో పలు పంచాయతీ , వివో భవనా లను స్థానిక నాయకులు, అధికారుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దనోరా లో మాట్లాడుతూ .. పోడుసాగుదారుల సమస్యలను కేంద్రం మాత్రమే పరిష్కరిస్తుందని , రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. గిరిజనే తరులకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం ఎటువంటి హక్కులను కల్పించదని గుర్తు చేశారు. అయితే మానవత దృక్పథంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తూ.. ఎన్నో సంవత్సరాలు గా ఉంటున్న రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. అలాగే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

<u>బైట్</u>

పిటిసి ఆసిఫాబాద్

**శ్రీధర్ బాబు**

సెమికండక్టర్ రంగానికి ఊతమిచ్చేలా , తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని ‘టీ-వర్క్స’లో దేశంలోనే మొట్టమొదటి కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. సెమికండక్టర్ల తయారీలో కీలకమైన వేఫర్ ఫ్యాబ్రికేషన్ కోసం

ఉపయోగించే సీఎంపీ ప్యాడ్‌ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ కేంద్రం ఏర్పాటైంది. జపాన్‌కు చెందిన 'తోహో కోకి సీసాకుషో ' భాగస్వామ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా స్టార్టప్‌లకు , పరిశోధకులకు అవసరమైన సాంకేతిక మద్దతు, శిక్షణ లభిస్తుందని మంత్రి తెలిపారు.

**డెస్క్**

సామూహిక హత్యోదంతం

రంగారెడ్డి జిల్లాలోని దైవలగూడలో జరిగిన దారుణ సామూహిక హత్యలు కలకలం సృష్టించింది. 28 ఏళ్ల రాజ్‌కుమార్ అనే వ్యక్తి... తన కుటుంబ సభ్యులతో పాటు తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక సహా మొత్తం ఆరుగురిని దారుణంగా హత్య చేశాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు... మొదట ఆ మైనర్ బాలిక, ఆమె తల్లి, నానమ్మల గొంతు కోసి హత్య చేశాడు. ఆ తర్వాత తన ఇంటికి చేరుకుని భార్యతో పాటు ఇద్దరు చిన్న కుమారులను కూడా హతమార్చాడు. ఈ దారుణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

డెస్క్

**కేటీఆర్**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు . పబ్లిక్

ప్రాసిక్యూషన్ బలహీనమైన వాదనల కారణంగా పోక్సో కేసులో నిందితుడు బెయిల్ పొందగలిగాడని , ఈ దారుణ హత్యలు ప్రభుత్వ అసమర్థత వల్లే జరిగాయని మాజీమంత్రి ఆరోపించారు. నిందితుడికి బెయిల్ ఇవ్వవద్దని బాధితురాలి కుటుంబం ఎంతగానో ప్రాధేయపడినా , వారి భయాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ఇంతటి దారుణం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. వీటిని 'ప్రభుత్వ ప్రేరేపిత హత్యలు 'గా అభివర్ణించా రు. మహిళలకు రక్షణ కల్పించడంలో , న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

డెస్క్

**తెలంగాణ భవన్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మళ్లీ గెలవడం అసాధ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రోజు తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ... సీఎం స్వయంగా చేయించుకున్న అంతర్గత సర్వేల ప్రకారం బీఆర్ఎస్ 78 స్థానాలతో విజయం సాధించ బోతుందని తేలిందని ఆయన పేర్కొన్నారు. తన పాలనపై ముఖ్యమంత్రికి నమ్మకం ఉంటే అసెంబ్లీని రద్దు చేయాలని లేదా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఉపఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ప్రస్తుత ప్రభుత్వ నీటి యాజమాన్య తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నెపల్లి వద్ద అందుబాటులో ఉన్న గోదావరి

నీటిని పంప్ చేయకుండా , రాష్ట్రాన్ని ఉద్దేశపూర్వకంగా ఎండబెడుతున్నారని ఆరోపించారు.

డెస్క్

**హరీష్ రావు**

కేవలం రాజకీయ కక్షతో నే ప్రభుత్వం కృత్రిమ కరవు సృష్టిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపించారు. గోదావరిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ, ప్రభుత్వం కన్నెపల్లి పంపులను నడపడానికి నిరాకరిస్తోందని , దీనివల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందకుండా పోతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**డెస్క్**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

సూర్యాపేట జిల్లా కోదాడలో 17 కోట్ల రూపాయలతో నిర్మించనున్న బస్ స్టేషన్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా, మౌళిక వసతులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణా లు కల్పించామని పేర్కొన్నారు.

డెస్క్

**వియత్నాం ప్రమాదం**

వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకుల స్పీడ్ బోటు సముద్రంలో బోల్తా పడిన ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ప్రమాద సమయంలో పడవలో 32 మంది భారతీయులతో పాటు నలుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. తీరానికి కేవలం 400 మీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది.

డెస్క్

యాదగిరిగుట్ట

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ప్రధాన ఆ లయ ముఖమండపం బంగారు వాకిలి ప్రాంగణంలో ఈ రోజు నూతన దేవస్థాన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డి , సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖతో పాటు ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

పీటీసీ యాదాద్రి భువనగిరి